ప్రజాశక్తి
శనివారం 19 ఆగస్టు 2023 5
శ్రీ సత్యసాయి






వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

83 శాతానికి పైగా ఇంటింటి సర్వే పూర్తి

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఇంటింటికి ఓటర్ల సర్వే కార్యక్రమం 83 శాతం పూర్తి అయిందని కలెక్టర్ పి.అరుణ్ బాబు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం నాడు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించాలన్నారు. అర్హులైన ఏ ఒక్కరినీ జాబితా నుంచి తొలగించవద్దన్నారు. అనంతరం కలెక్టర్ అరుణబాబు జిల్లాలో చేపట్టిన ఇంటింటి ఓటర్ల సర్వే కార్యక్రమం గురించి తెలియజేశారు. జిల్లాలో 5,48,750 ఇళ్లకు సంబంధించి ఓటర్ల జాబితా సర్వే చేయాల్సి ఉండగా, ఇంతవరకు 83 శాతం ఇళ్లను సర్వే పూర్తి చేశామన్నారు. మిగిలిన సర్వేను మూడు రోజులలో పూర్తి చేస్తామన్నారు. వీటిలో నకిలీ ఓటర్లు 633, ఇళ్లు మారినవారు 1929, మరణించిన ఓటర్లు 6952గా గుర్తించామన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. 100 సంవత్సరాలు వయస్సు దాటిన 67మంది ఓటర్లను గుర్తించమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్, పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, ధర్మవరం ఆర్డీవో తిప్పేనాయక్, కదిరి ఆర్డీవో రాఘవేంద్ర, మడకశిర నియోజకవర్గం ఎన్నికల అధికారి చిన్నయ్య, సంబంధిత ఆయా నియోజకవర్గాల తహశీల్దార్లు పాల్గొన్నారు.



మూడు సంవత్సరాలుగా కరువు ఛాయలు లేవని అనుకుంటుండగానే కరువు మరోమారు ఉమ్మడి అనంతపురం జిల్లాను పలకరిస్తోంది. సీజన్ ముగుస్తున్నా వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. ఈ ప్రభావం సాగుపై పడింది. జిల్లాలో సాధారణ సాగులోనే ఎనిమిది లక్షల ఎకరాల్లో ఇప్పటికీ విత్తనం పడలేదు. అందులో సత్యసాయి జిల్లాలో అయితే ఏకంగా 30 శాతమే సాగైంది. అనంతపురం జిల్లాలో 65 శాతం వరకు విత్తనం పడింది. సాగు విస్తీరణం గణనీయంగా తగ్గడం, వేసిన కొద్దిపాటి పంటలు కూడా ఎండదశలో ఉండడంతో ఈ సారి కరువు తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- 8.14 లక్షల ఎకరాలు బీడు
- ఉమ్మడి జిల్లాలో 47 మండలాల్లో వర్షాభావం
- ప్రత్యామ్నాయానికి వందశాతం సబ్సిడీ ఎత్తివేత
- 20 శాతం సబ్సిడీతో పంపిణీకి సిద్ధం



వర్షం లేక బీడుగా ఉన్న వ్యవసాయ పొలం

కమ్ముకుంటున్న కరువు..!



అరకొర వర్షంతో ఎండుతున్న వేరుశనగ పంట

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాధారణ సాగు 16.16 లక్షలు. అయితే సాగైంది చూస్తే 8.01 లక్షల ఎకరాలు మాత్రమే. విభజిత జిల్లాల వారీగా చూస్తే సత్యసాయి జిల్లాలో ఏడు లక్షలు సాధారణ సాగయితే 2.07 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఐదు లక్షల ఎకరాల్లో పంటలు సాగవలేదు. ఇక అనంతపురం జిల్లాలో చూస్తే సాధారణ సాగు 9.15 లక్షల ఎకరాలయితే దాదాపు ఆరు లక్షల్లో పంటలు సాగయ్యాయి. ప్రధాన పంట వేరుశనగ 15.29 లక్షల ఎకరాలు సాధారణ సాగు అవ్వాల్సి ఉంది. 4.51 లక్షల ఎకరాల్లో సాగైంది. సత్యసాయి జిల్లాలో1.55 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఆగస్టు మొదటి వారం వరకు మాత్రమే వేరుశనగ సాగుకు అనువైన సమయం. ఆ సమయం వరకు కూడా వర్షాలు పడకపోవడంతో వేరుశనగపై ఆశలు ఆవిరయ్యాయి.

47 మండలాల్లో వర్షాభావం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలుంటే 47 మండలాల్లో వర్షాభావం నెలకొంది. ఇందులో ప్రధానంగా ఆరు మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 168 మిల్లీమీటర్లుకుగానూ 127 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం పడింది. 24.3 శాతం తక్కువ వర్షపాతం పడింది. ఈ జిల్లాలో 21 మండలాల్లో వర్షాభావం నెలకొంది. ఇక సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 189.2 మిల్లీమీటర్లకుగానూ 119.9 మిల్లీమీటర్లు పడింది. ఇందులో ఆరు మండలాల్లో 50 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది.

20 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు

ప్రధాన పంటల సాగుకు సమయం పూర్తవడంతో ప్రత్యామ్నాయ విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు సబ్సిడీని ఖరారు చేసింది. వరి విత్తనం కిలో రూ.37.80 పూర్తి స్థాయి ధర అయితే 80 శాతం సబ్సిడీ ప్రకారం రూ.30.24పోనూ రూ.7.56 నాన్ సబ్సిడీ మొత్తాన్ని ఇవ్వాలి. మినుములు, పెసలు కిలో రూ.117.50 పూర్తి స్థాయి ధర ప్రకారం సబ్సిడీ రూ.94 పోనూ నాన్ సబ్సిడీ రూ.23.50 రైతు చెల్లించాలి. కొర్ర కిలో పూర్తి ధర రూ.67.50కిగానూ సబ్సిడీ ధర రూ.54పోనూ రూ.13.50 నాన్ సబ్సిడీ ధర చెల్లించాలి.

జిల్లా సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ జట్టుకు మడకశిర విద్యార్థులు

ప్రజాశక్తి-మడకశిర రూరల్



హిందూపురం పట్టణంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన మడకశిర పట్టణానికి చెందిన క్రీడాకారులు కీర్తిచరణ్, ఆదిత్య జిల్లా సబ్ జూనియర్ అండర్-13 బాలుర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. వీరు హిందూపురంలో మూడు రోజుల పాటు శిక్షణ శిబిరంలో పాల్గొని అనంతరం కడపలో జరిగే జోనల్ స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. వీరు ఆర్డిటి అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారు. వీరి ఎంపిక పట్ల మండల ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు రవిశంకర్, మోహన్, నవీద్, నాగభూషణం, బాలాజీ హర్షం వ్యక్తం చేశారు.

మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-పెనుకొండ



చైర్మన్ శ్రీనివాసులును అభినందిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని యార్డ్ నూతన చైర్మన్ కలిపి శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద శుక్రవారం చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ కార్యదర్శి శ్రీనివాసులు చేత నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు చైర్మన్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు యార్డ్ నూతన చైర్మన్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ గీతారామ్మోహన్‌రెడ్డి, రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్, నాయకులు బి.నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలింగ్

రొద్దం : రొద్దం 3వ వార్డు మెంబర్ స్థానానికి శనివారం(నేడు) స్థానిక ఎంపియుపి పాఠశాలలో పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. దీంతో పాఠశాల నుంచి 200 మీటర్ల వరకూ 144 ఆంక్షలు అమలులో ఉంటాయని ఎస్ఐ నాగస్వామి తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ సహకరించాలని, అలాగే ఆ వార్డుకి తప్ప మిగతా వారు ఎవరూ హాజరు కాకూడదని ఆయన హెచ్చరించారు.

మండల ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


సోమందేపల్లి : స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం ఎపిటిఎఫ్ స్టేట్ కౌన్సిలర్ జవాజి నాగరాజు ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సి.క్రిష్టప్ప, అధ్యక్షుడిగా చంద్ర, ప్రధాన కార్యదర్శిగా సంజీవరాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేయాలని, టీచర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివన్న, రంగేష్‌కుమార్, విజయ కుమార్‌నాయక్, దస్తగిరి, ఆనంద్, ఇర్ఫాన్, రంగేనాయక్, రాయుడు, గణేష్, ఉపేంద్ర, రామకృష్ణ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జెసిఎస్ బీమా ఇన్సూరెన్స్ నమోదు

పెనుకొండ : సచివాలయ కన్వీనర్లకు ప్రభుత్వం అందిస్తున్న జెసిఎస్ బీమా ఇన్సూరెన్స్ కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే శంకరనారాయ పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు తెలిసేలా, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని వైసిపి కోసం పని చేస్తున్న కార్యకర్తలను సచివాలయ కన్వీనర్లుగా ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని జెసిఎస్ కన్వీనర్లు, ఎంపిపిలు, మండల కన్వీనర్లు, సచివాల య కన్వీనర్లు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

గోరంట్ల రూరల్ : పంద్రాగస్టు రోజున ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సిఐ సుబ్బరాయుడుని శుక్రవారం మండల అగ్రి అడ్వైజర్ కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, జడ్పిటిసి పాలే జయరాంనాయక్, పెడబల్లి శ్రీనివాస్‌నాయక్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐ సుబ్బరాయుడు పోలీస్ శాఖలో ప్రజలకు మరిన్ని సేవలందించి, మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.



సిఐ సుబ్బరాయుడుని సన్మానిస్తున్న రామకృష్ణారెడ్డి

మత్స్యకారుల జీవనోపాధి పెంపునకు చర్యలు

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి -పెనుకొండ




ఆంధ్ర డైలీసియస్ యూనిట్‌ను ప్రారంభించిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు

మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని గుట్టూరు పంచాయతీ అమ్మవారు పల్లి కియా కార్ల కంపెనీ ప్రధాన మెయిన్ గేట్‌లో శుక్రవారం కలెక్టర్ ఆంధ్ర డైలీసియస్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 'ఫిష్ ఆంధ్ర- ఫిట్ ఆంధ్ర' కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. స్థానికంగా లభించే చేపలను స్థానిక ప్రజల అవసరాలకు వినియోగించుకోవాలన్నదే ఫిష్ ఆంధ్ర ముఖ్య ఉద్దేశమన్నారు. ఫిష్ ఆంధ్ర స్టోర్ ఏర్పాటు చేయడం, లబ్ధిదారులకు సులభతరం చేయడానికి ప్రభుత్వం సరళీకృత అప్లికేషన్ ప్రక్రియను తీసుకొచ్చిందని, నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం సబ్సిడీతో మత్స్యశాఖ ఆధ్వర్యంలో రుణాలు అందజేస్తామన్నారు. చేపలు తినడం వల్ల మంచి పోషకాహారం లభిస్తుందన్నారు. గుండె జబ్బులు, మధుమేహం తగ్గుముఖం పడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యే శంకరనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి జెసి కె. కార్తీక్, మత్స్య శాఖ జిల్లా అధికారి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, యూనిట్ అధికారి నిర్మల, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-మడకశిర



సచివాలయంలో బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

అమరాపురం మండల పరిధిలోని హల్కూరు పంచాయతీ ఉదుగూరు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించా లని డిమాండ్ చేస్తూ శుక్రవారం మహిళలు ఆ గ్రామ సచివాలయంలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గ్రామంలో నెల రోజుల నుంచి తాగునీటి సమస్య నెలకొన్నా ఎమ్మెల్యే తిప్పేస్వామి కానీ సచివాలయ అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. గ్రామంలో అనేక సమస్యలు నెలకొన్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు సుమారు 2 గంటల పాటు సచివాలయంలో నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే సొంత గ్రామంలోనే తాగునీటి సమస్యను పరిష్కరించకపోవడం దారుణ్మని మండిపడ్డారు.

పంట నమోదు చేయించుకోండి

ప్రజాశక్తి -పెనుకొండ



పంటను నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

మండల పరిధిలోని గుట్టూరు రైతు భరోసా కేంద్రం పరిధిలో చేపట్టిన పంటను నమోదు ప్రక్రియను శుక్రవారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి, వ్యవసాయ అనుబంధ శాఖల ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రమణారెడి మాట్లాడుతూ ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. తద్వారా పంటలకు నష్టం వాటిల్లితే పరిహారం, పంటల బీమా అందుతాయని, అలాగే ధాన్యాన్ని ఆర్‌బికె ల ద్వారా కొనుగోలు చేస్తారని, తదితర ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆర్‌బికె సిబ్బంది రైతులు పండించిన ప్రతి పంటనూ నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి పద్మావతి, ఎపిఎంఐపి పిడి సుదర్శన్, ఎఒ బి.శంకర్‌నాయక్, ఎఇఒ అశోక్‌కుమార్, విఆర్‌ఒ, సర్వేయర్, ఆర్‌బికె సిబ్బంది, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

పెనుకొండ సబ్ కలెక్టర్‌కు సన్మానం

పెనుకొండ : ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌ను శుక్రవారం కార్యాలయంలో పలువురు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో హైకోర్టు న్యాయవాది హెచ్.శివరామ కృష్ణ, సీనియర్ పాత్రికేయులు రవూఫ్, ఎంఆర్‌పిఎస్ నాయకులు రామాంజి, మూర్తి, రాము, తిమ్మాపురం నరసింహులు, రంగేపల్లి మూర్తి, మునిమడుగు నరసింహులు, కోనాపురం కొల్లప్ప, కదిరప్ప, రామకృష్ణ, శెట్టిపల్లి మూర్తి ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని ఎస్సి బాలికల హాస్టల్‌కు నీటి సౌకర్యం కల్పించలేని ప్రజాప్రతినిధులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ఒక్క రోజైనా మీరు బాలురు, బాలికల హాస్టళ్లను సందర్శించారా అని ప్రశ్నించారు. ఎస్సి బాలికల హాస్టల్ విద్యార్థినులు నీటి కోసం మున్సి పల్ ఆఫీస్ పరిధిలోని సంపును ఆశ్రయిస్తున్నా మీరు స్పందించరా అని నిలదీశారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సంక్షేమ హాస్టళ్లలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే మడకశిరలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లుమర్రి వినయ్, జిల్లా ఉపాధ్యక్షుడు మురళిబాబు, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి 'మహాశక్తి'పై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-మడకశిర

పేదలను సంపన్నులు చేయడమే టిడిపి ధ్యేయమని నియోజకవర్గ పార్టీ మహిళా అధ్యక్షురాలు మీనాక్షి తెలిపారు. అమరాపురం మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో శుక్రవారం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మహాశక్తి పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి రూపొందించిన భవిష్యత్తుకి గ్యారెంటీ పథకాలను వివరించారు. అలాగే సిఎం జగన్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలిపారు. ప్రజలను చైతన్యవంతులను చేసి టిడిపిని అధికారంలోకి తీసుకోరావడానికి పార్టీ శ్రేణులు నిబద్ధతగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, కృష్ణమూర్తి, మల్లికార్జున, తాతరాజు, జయకుమార్, హనుమంతరాయప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి-లేపాక్షి



మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు

స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో సభ్యులు సమస్యలు ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడు తూ ఉపాధి హామీ కూలీలకు, సిరికల్చర్ శాఖ ద్వారా మల్బరీ షెడ్లు నిర్మించుకున్న వారికి సకాలంలో బిల్లులు మంజూరు చేయాలని కోరారు. మండలంలో మల్బరీ పంట సాగు చేస్తున్న రైతులకు తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. జగనన్న కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. పొలాలకు ఉచితంగా మట్టి తోలుకునేందు కు రైతులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఎపిఎం మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు రూ. 1 లక్ష నుంచి రూ. 20 లక్షల వరకూ రుణాలు ఇస్తామ ని, అందులో సామగ్రికి 35 శాతం సబ్సిడీ ఇస్తామని అవసరమైన దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ నరసింహనాయుడు, తహశీల్దార్ బాబు, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు లీలావతి, అంజిరెడ్డి, అధికారులు నాగరాజు నాయక్, వెంకటేశ్వర్లు, నాగరత్నమ్మ, హేమలత, చిరంజీవి, పంచాయతీ సర్పంచిలు వసుంధర, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ముద్ర రుణాలివ్వాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి




బ్యాంక్ డిప్యూటీ మేనేజర్‌కి వినతి పత్రం అందజేస్తున్న జాతీయ చేనేత ఐక్య వేదిక నాయకులు

చేనేత కార్మికులకు ముద్ర లోన్లు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి షీలా నారాయణ స్వామి ఆధ్వర్యంలో స్థానిక కెనరా బ్యాంక్ డిప్యూటీ మేనేజర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సోమందేపల్లిలో 80 శాతం మంది చేనేత వృత్తిపై ఆధారపడి ప్రత్యక్షంగా పరోక్షంగా జీవిస్తున్నారన్నారు. కావున దరఖాస్తు చేసుకున్న ప్రతి చేనేత కార్మికుడికి షరతులు లేకుండా ముద్ర రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఈశ్వర్, ఎస్.బాబావలి, డి.సోమశేఖర్, బి.వెంకటేష్, బి.కిష్టప్ప, కె.కిష్టప్ప, కె.నాగరాజు, పి.నరసింహులు, నల్లగొండ్రాయునిపల్లి శ్రీరాములు, ఎస్.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ప్రభుత్వం చేయూత

ప్రజాశక్తి-పెనుకొండ



విద్యార్థి డేనియల్‌కు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పట్టణంలోని ఆల్విన్ కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన రవీంద్రనాథ్ కుమారుడు డేనియల్‌నాయక్ వైద్య విద్య చదివేందుకు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ పి.అరుణ్ బాబు రూ. 1,44,000 చెక్కును అందజేశారు. కలెక్టర్ శుక్రవారం మండలంలో పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇందులో రూ. 1,44,000 చెక్కును విద్యార్థి డేనియల్ నాయక్‌కు అందజేసి, ఎంబిబిఎస్ సీటు సాధిం చినందుకు అభినందించారు. అలాగే జిల్లా యం త్రాంగం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జెసి, పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు సెరికల్చర్ జెడి పద్మావతి, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, మత్స్య శాఖ ఎడి చంద్రశేఖర్‌రెడ్డి, రవీందర్‌నాయక్, లతాబాయ్, తహశీల్దార్ స్వర్ణలత, ఎంపిడిఒ శివశంకరప్ప, ఆర్ఐ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెసి ఎండి రూ. 20వేలు అందజేత

డేనియల్‌నాయక్ మెడిసిన్ చదవడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న శ్రీకృష్ణదేవరాయ కన్‌స్ట్రక్షన్స్(ఎస్‌కెసి) ఎండి ఎల్.నారాయణచౌదరి పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద రూ. 20 వేలు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ చౌదరి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా తన వంతు సాయం చేస్తానని డేనియల్‌కు భరోసా ఇచ్చారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

తలుపుల : ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన ఎసిఐ మక్బుల్‌బాషాను శుక్రవారం సన్మానించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని వివిధ పార్టీ రాజకీయ నాయకులు, అధికారులు తదితరులు ఘనంగా సన్మానించారు.

పంట నమోదు తప్పనిసరి

కొత్తచెరువు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా జెడిఎ సుబ్బారావు తెలిపారు. మండల పరిధిలోని బైరాపురం ఆర్‌బికె పరిధిలో రైతులు సాగు చేసిన పంట పొలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నటరాజు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

బుక్కపట్నం: నేటి తరం విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఇఒ గోపాల్ నాయక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో షూటింగ్ బాల్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులు హాజరైన వారు మాట్లాడుతూ నేటి తరం యువత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, ఉత్తేజం కలుగుతుందని తెలిపారు. ఈ పోటీలలో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 50 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనగా 24 మంది విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన వారు సెప్టెంబర్ నెల 8వ తేదీ నుంచి 10 వరకు నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి 42వ పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి షూటింగ్ బాల్ కార్యదర్శి పూల శివప్రసాద్, ప్రధాన ఉపాధ్యాయుడు జగదీష్, వెంకటేష్ ప్రసాద్, పీడీలు నాగరాజు, కర్ణ కుమారి, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చలివెందులలో శనివారం జరిగే పంచాయితీ ఉప ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంపిడిఒ నరేంద్ర కుమార్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన పనులను శుక్రవారం ఎంపిడిఒ నరేంద్ర కుమార్ ఎన్నికల అధికారి క్రిష్టప్పతో కలిసి పరిశీలించారు.

బుక్కపట్నం : మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామపంచాయతీలోని ఏడవ వార్డుకు జరిగే ఉప ఎన్నికకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నిక జరుగుతుందన్నారు. ఆ తర్వాత కౌంటింగ్ ప్రారంభించి గెలిచిన అభ్యర్థికి డిక్లరేషన్ ఫారం అందజేస్తామన్నారు. ఎన్నికల అధికారిగా ఎంఇఒ గోపాల్ నాయక్ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

బత్తలపల్లి : మండలంలోని తంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డు ఎన్నికకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర్ ప్రకటించారు. 3వ వార్డు స్థానానికి 128 ఓట్లు ఉన్నట్లు తెలిపారు. అందులో స్త్రీల ఓట్లు 66, పురుషుల ఓట్లు 62 ఓట్లు ఉన్నట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణకు ముగ్గురు అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నిక సజావుగా జరిగేందుకు ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి ఎస్ఐ ప్రదీప్ కుమార్ పర్యవేక్షణలో ఎఎస్ఐ సోమశేఖరమూర్తి, నలుగురు కానిస్టేబుళ్లను నియమించినట్లు చెప్పారు.

వార్డు అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

బత్తలపల్లి : మండలంలోని తంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డుకు వైసిపి మద్దతుతో పోటీ చేసిన లక్ష్మీనారాయణమ్మను గెలిపించాలని గత రెండు రోజులుగా గ్రామ సర్పంచు సానె జయచంద్రారెడ్డి, గ్రామ నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పచారంలో అభ్యర్థిని లక్ష్మీనారాయణమ్మ, ఉప సర్పంచు వీడాల ప్రతాపడ్డితో పాటు గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా టీడీపీ మద్దతుగా నిలిచిన అభ్యర్థికి మద్దతుగా మండలంలోని టీడీపీ నాయకులు అందరూ తరలివచ్చి ప్రచారం నిర్వహించారు.

'విధులకు ఎంపిడిఓ డుమ్మా'

గాండ్లపెంట : మండల అభివృద్ధి అధికారి 9 రోజుల నుంచి విధులకు డుమ్మా కొడుతున్నారని సిపిఎం, సిపిఐ నాయకులు విమర్శించారు. ఈ మేరకు సిపిఎం రాజారెడ్డి, ఖాదర్‌బాషా, సిపిఐ శ్రీరామనాయుడు మాట్లాడుతూ. ఎంపీడీవో యాదవేంద్ర గత తొమ్మిది రోజుల నుంచి విధులకు హాజరు కావడం లేదని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పనులు జరగక ప్రజలు కార్యాలయానికి చుట్టూ తిరిగి పోతున్నారని, కింది స్థాయి సిబ్బంది కూడా సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని విమర్శించారు.కార్యాలయ సిబ్బందిని ఎంపీడీవో వివరాలు అడిగితే తమకు తెలియదని ఫోన్ ద్వారా కూడా అందుబాటులో లేదని చెబుతున్నారని అన్నారు. గ్రామ సచివాలయాలలో పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామ సచివాలయ సిబ్బంది ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు చొరవ తీసుకొని ఎంపిడిఓ ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఖాళీ కుర్చీకి వినతి

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు మండల వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 8 వారాల బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఓ కార్యాలయంలో అందజేయడానికి నాయకులు వెళ్లారు. 11 గంటలైనా ఎంపిడిఓ కార్యాలయానికి రాకపోవడంతో ఖాళీ కుర్చీకే వినతిపత్రం అందజేశారు. అధికారులు కార్యాలయాలకు సమయానికి రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని అన్నారు. అలాగే పెండింగ్ ఉపాధి బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యుత్ సమస్యతో ఎండుతున్న పంటలు



నీరు లేక వాడిపోయిన మొక్కజొన్న పంట

ప్రజాశక్తి - పరిగి

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు వినతులతో వేడుకున్నా పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. వడ్డీలకు తెచ్చి కరెంటు కోసం లక్షల ఖర్చు చేసి కరెంటు స్తంభాల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ మరమ్మతుల విషయంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలోని సర్వే నెంబరు 441,42,43 లలో సుమారు 50 ఎకరాలలో మిరప, మొక్కజొన్న, మల్బరీ పంటలను సాగు చేస్తున్నామన్నారు. మూడు నెలల క్రితమే ఈ ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్ హై వోల్టేజీతో కాలిపోయిందని చెప్పారు. అప్పటినుండి ఇప్పటివరకు పలుమార్లు అధికారులకు వినతులు అందించినా, చివరికి ఎమ్మెల్యేతో ఫోన్ ద్వారా చెప్పించినా పట్టించుకోలేదని పరిగి, శ్రీరంగరాజు పల్లి, పాపిరెడ్డిపల్లికి చెందిన రవీంద్ర రెడ్డి, ఆదినారాయణ, ప్రభాకర్, సివలింగగౌడ్, వెంకటేశ్, నాగరాజు, శ్రీనివాసులు, గోవిందప్ప వాపోయారు. ఇప్పటికే పంట సాగు మధ్యస్థితిలో ఉందనిఈ సమయంలో పంటలు ఎండిపోతే తీవ్రంగా నష్టపోయి తాము పూర్తిస్థాయిలో అప్పుల ఊబిలో ఇరుకుంటామని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై విద్యుత్ ఏఈ నిజాముద్దీన్‌ను వివరణ కోరగా రైతులకు కేటాయించిన ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ కేవీ లతో కూడుకున్నదని ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు 23 కలెక్షన్లు ఉన్నాయని చెప్పారు. అయితే అందులో 3 మాత్రమే అనుమతి పొందిన కనెక్షన్లు అని అన్నారు. ఇప్పటికే కొంతమంది రైతులకు నోటీసులు ఇచ్చామని రైతులంతా సహకరించి మరో ట్రాన్స్‌ఫార్మర్‌కు నగదు చెల్లిస్తే రెండో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు.



పరిటాలశ్రీరామ్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

వైసీపీపాలనలో అర్హులకు అన్యాయం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలులో అర్హులకు అన్యాయం జరుగుతోందని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ విమర్శించారు. పట్టణంలోని 5వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక టీడీపీనాయకులతో కలిసి ఇంటిం టికి వెళ్లి మినీమేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీచేశారు. ఈసందర్భంగా వార్డు ప్రజలు తమ సమస్యలను పరిటాల శ్రీరామ్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందిస్తామనానరు. సంక్షేమకార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పే వైసీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్నప్పటికీ ఇన్ని షరతులు ఎందుకని ప్రశ్నించారు. కళ్ల ముందే వారిపరిస్థితి కనిపిస్తున్నా పథకాలు వర్తింపచేయడం లేదన్నారు. ధర్మవరంలో బీసీలు అధికంగా ఉన్నారని వారి రక్షణ కోసం బీసీరక్షణ చట్టం కూడా తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి దేవరకొండ రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి రాళ్లపల్లిషరీఫ్, ఐటీడీపీ పట్టణ అధ్యక్షులు చెలిమిశివరాం, సెక్షన్ ఇన్‌ఛార్జి బాల మాలతి తదితరులు పాల్గొన్నారు.

టైం స్కేల్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎన్ఎంఆర్, డైలీ వేజెస్, ఫుల్ టైం, పార్ట్ టైం సిబ్బంది సర్వీస్ లను క్రమబద్ధీకరించాలని టైం స్కేల్ ఉద్యోగులు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం పట్టణంలో సత్యమ్మ గుడి సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ మూడు దశాబ్దాల తర్వాత సర్వీస్ గల వారిని క్రమబద్ధీకరణ కు సానుకూల నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. అయితే వివిధ ప్రభుత్వ శాఖల్లో 30 ఏళ్లుగా మినిమం స్కేల్ క్రింద పనిచేస్తున్న తమని క్రమబద్ధీకరిస్తున్నామని ప్రకటించకపోవడం దారుణమన్నారు. తమకంటే వెనుక వచ్చిన వారిని క్రమబద్ధీకరిస్తూ తమకు అన్యాయం చేయడం బాధాకరమన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి తమను కూడా క్రమబద్ధీకరించి ఆదుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ అరుణ్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టైం స్కేల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గోవిందప్ప, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యాయుడు వేమయ్య, కోశాధికారి లక్ష్మీనారాయణ, ఎస్‌టి వెల్ఫేర్ సిబ్బంది రామకృష్ణ, రంగే నాయక్, రమణప్ప, కృష్ణ నాయక్, బీసీ వెల్ఫేర్ సిబ్బంది ప్రభాకర్, సోము, హిదయతుల్లా, భాగ్యమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, నాయకులు

నిరవధిక సమ్మెకు పూర్తిస్థాయి మద్దతు : సిఐటియు



కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు, కాంట్రాక్ట్ కార్మికులంతా ఒకే వేదిక పైకి వచ్చి న్యాయమైన వేతన ఒప్పందాన్ని సాధించటానికి అవసరమైతే నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని దీనికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప అన్నారు. శుక్రవారం స్థానిక ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ముందు విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం చేసిన యజమాన్యం, పవర్ జేఏసీ వేతన ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ కరపత్రాలను విడుదల చేసి కార్యాలయంలో ఉద్యోగులకు పంపిణీ చేశారు. ఈ నెల 9న రాష్ట్ర మంత్రులు, ఉన్నత అధికారులతో పవర్ జేఏసీ నాయకత్వం చేసిన విద్యుత్ వేతన ఒప్పందాన్ని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ ట్రగుల్స్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గత 17 నెలల నుండి ఆందోళనల కార్యక్రమాలు చేపట్టారన్నారు. పవర్ జాక్ చర్చలను సాగదీసి ఏ ఒక్క డిమాండ్ పరిష్కరించ లేదని విమర్శించారు. దీంతో ఉద్యోగులు అందరు కలిసి స్ట్రగుల్స్ కమిటీ ఏర్పడి పోరాటానికి సిద్ధపడ్డారన్నారు. ఆగస్టు 10 వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు పోరాట కమిటీ పిలుపునిచ్చిందన్నారు. అయితే ఆగస్టు 9 న పవర్ జేఏసీ అర్ధాంతరంగా ఉద్యమాన్ని విరమించిందని అన్నారు. దీనికంటే ముందు ఆగస్టు 8 చలో విద్యుత్ సౌధాన్‌కు పోలీసుల అనుమతి లేదని ఉపసంహరించుకుంది. వర్క్ టూ రూల్ పిలుపునిచ్చి ఏ మాత్రం ఆ కార్యక్రమాన్ని అమలు చేయకుండా కార్మికులను మోసం చేసిందన్నారు. విద్యుత్ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే అన్ని ఆందోళన కార్యక్రమాలతో పాటు నిరవధిక సమ్మె చేపడితే అన్ని కార్యక్రమాలకు సిఐటియు రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కల్లూరు ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రఫీ, శ్రీరామప్ప, చంద్రశేఖర్, కష్ణమూర్తి, శీను తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సాధికారిక కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిక అధికారిణి లక్ష్మీ కుమారి కోరారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులు జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా కోఆర్డినేటర్, బ్లాక్ కోఆర్డినేటర్, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్, పోస్టులు భర్తీ కొరకు నోటిఫికేషన్ మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని కార్యాలయంలో ఖాళీగా ఉన్న జిల్లా కోఆర్డినేటర్, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్, బ్లాక్ కోఆర్డినేటర్ హిందూపురం, ఓబులదేవ చెరువు, మొత్తం ఐదు ఖాళీలను భర్తీ చేసేందుకు కలెక్టర్ ఆమోదం తెలిపారన్నారు. ఇందుకు అర్హులైన అభ్యర్థుల నుండి 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. దరఖాస్తులు పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్దగల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయానికి అందజేయాలని వారు తెలిపారు. జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ పోస్టుకు కంప్యూటర్ సైన్సు లేదా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో డిగ్రీ లేదా డిప్లమా కలిగి ఉండాలని అలాగే పనిచేసిన అనుభవం కలిగిఉండాలని చెప్పారు. తెలుగు స్పష్టంగా రాయడం చదవడం రాయడం రావాలని ఉద్యోగరీత్యా జిల్లా అంతటా ప్రయాణం చేసేందుకు సంసిద్ధులై ఉండాలని కంప్యూటర్ నందు మంచి ప్రావీణ్యం కలిగి ఉండాలని అన్నారు. వేతనం రూ. 30వేలుగా నిర్ణయించామన్నారు. అదేవిధంగా బ్లాక్ కోఆర్డినేటర్ పోస్టుకు కంప్యూటర్ సైన్స్ లేదా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో డిగ్రీ లేదా డిప్లమా కలిగి ఉండాలని, అప్లికేషన్ మెయింటెనెన్స్ సపోర్ట్ నందు కనీసం రెండు సంవత్సరాలు పనిచేసిన అనుభవం కలిగి ఉండాలని అన్నారు. వేతనం రూ.20వేలుగా ఉంటుందన్నారు. జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్ట్ కు, మేనేజ్మెంట్ సోషల్ సైన్సు మరియు న్యూట్రిషన్ నందు డిగ్రీ లేదా తస్సమాను పీజీ డిప్లమా కలిగి ఉండాలన్నారు. టీం సభ్యులకు శిక్షణ ఇవ్వడంలో, పర్యవేక్షించడంలో కనీసం రెండు సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలని చెప్పారు. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో పట్టు కలిగి కంప్యూటర్‌లో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. వీరికి వేతనం రూ. 18వేలుగా నిర్ణయించామనాన్రు. ఈ పోస్టులు కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక ఏడాది కాలం కొరకు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి శ్రేణులు

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి '

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమనిఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామ కోటి ఆదినారాయణ, తెలుగు మహిళా నాయకురాళ్లు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు లోని బడే నాయక్ తండా, గోనే నాయక్ తండాలో మహాశక్తి ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల అమలుతో ప్రతి పేద కుటుంబంలో ఆనందం నెలకొంటుందన్నారు. వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు నష్టపోతున్నారని, ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, అరాచకాల జరుగుతున్నాయని విమర్శించారు. అభివృద్ధిలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడవాలంటే అది టిడిపి అధినేత చంద్రబాబు తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు లావణ్య, పార్లమెంటు కార్యదర్శి మాధవి, మండల అధ్యక్షురాలు రాధమ్మ, చెన్నకృష్ణమ్మ, మస్తానమ్మ, నాయకులు ఎద్దుల ఈశ్వర్ రెడ్డి, శాంతాబాయి, సాయి లీల తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి జేసీ కార్తీక్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెనుకొండ సబ్ కలెక్టర్, ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ మండలి సమావేశం జరిగింది. అగ్రి బోర్డ్ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి సుబ్బారావు, కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ కుమార్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి కార్తీక్ మాట్లాడుతూ ఈ సమావేశంలో ప్రతిపాదించిన అంశాలన్నింటినీ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ లో రైతులకు అవసరమైన పంటల సాగుకు సంబంధించి సూచనలు సలహాలు వ్యవసాయ సంబంధిత అధికారులు అందించాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ పకడ్బందీగా నమోదు చేయాలని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అగ్రి బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. పథకాలన్నీ రైతులకు చేరే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ప్రత్యామ్నాయ పంటల సాగుకు అధికారులు విత్తనాలు సరఫరా చేయాలని సూచించారు. సూక్ష్మ సాగు నీటి పరికరాలు, బిందు వ్యవసాయానికి కావలసిన పరికరాలు రైతులకు అందించాలన్నారు. నూతన జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఇందుకు 50 ఎకరాల ఎంపికకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు బజార్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాను పగలు పూటే అందించాలన్నారు. ఈ నెలాఖరు వరకు కంది పంట వేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి చంద్రశేఖర్, ఎపిఎంఐపి అధికారి సుదర్శన్, ద్వామా పీడీ రామాంజనేయులు, సిరికల్చర్ జేడీ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్‌ప్లాంట్‌లో కార్మికుడు మృతి

నంబుల పూలకుంట : మండల కేంద్రంలోని టాటా సోలార్ పవర్ ప్లాంట్ కంపెనీలో పనిచేసే కార్మికుడు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఫిరోజ్ ఖాన్ (28) కాంట్రాక్ట్ లేబర్ కింద సోలార్ కంపెనీలో గ్రాస్ కటింగ్ విధులు నిర్వహించేవాడు. తన విధుల్లో భాగంగా సోలార్ ప్లేట్ల కింద కంప చెట్లను కొడవలితో నరుకుతుండగా అక్కడున్న పవర్ వైరు తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన సిబ్బంది చికిత్స నిమిత్తం కదిరి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఫిరోజ్‌ఖాన్ మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

పుట్టపర్తి రూరల్: ఎఆర్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతిచెందిన కిరణ్ కుమార్ కుటుంబానికి పోలీసు శాఖ తరపున ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో కాని స్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మతి చెందిన కిరణ్ కుమార్ కుటుంబానికి రూ.75వేల విలువైన చెక్కును ఎస్పీ మాధవ్ రెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నామమన్నారు. మృతుడి కుటుంబానికి రావలసిన ఇతర ఆర్థిక సహాయాన్ని కూడా త్వరలోనే అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.విష్ణు, ఏవో సుజాత ఎస్‌బి సిఐ రవీందర్ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే ను జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి సవాళ్లను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వాట పరిష్కారం కోసం సత్వరమే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో పోలీసులు నిబద్ధతతో వ్యవహరించాలని ప్రజల పట్ల నేరస్తుల పట్ల వ్యవహరించే తీరు సరిగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి మాజీ ఎంపీపీ సుధాకర్ సోదరి ప్రమీలమ్మ మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బాధితులను శుక్రవారం పరామర్శించారు. ఈసందర్భంగా ప్రమీలమ్మ మతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ శ్రీరామిరెడ్డి, మండల కన్వీనర్ రామాంజనేయులు ,సామకోటి ఆదినారాయణ, గూడూరు ఓబులేసు ,అంబులెన్స్ రమేష్, ఆమెకు నివాళులర్పించారు. అదేవిధంగా జనసేన రాష్ట్ర నాయకులు పత్తి చంద్రశేఖర్ స్థానిక నాయకులు అబ్దుల్, తిరుపతేంద్ర, రాము, కాంగ్రెస్ నాయకులు కోటా సత్యనారాయణ తదితరులు ప్రమీలమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పించారు.


పిహెచ్‌సి నూతనభవనం ప్రారంభం

తలుపుల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని డాక్టర్ మున్వర్ బాషా, డాక్టర్ సల్మా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులలో నూతన భవనం లో పూర్తి స్థాయి వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - తలుపుల

నంబులపూలకుంట మండలం తిమ్మమ్మ మర్రిమాను గ్రామంలో జరిగే కార్యక్రమానికి హాజరవడానికి వెళుతున్న డిప్యూటీ సిఎం అంజాద్ బాషాకు తలుపుల వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు తలుపుల మండలంలోని సమస్యలను డిప్యూటీ సిఎంకు విన్నవించారు. అసంపూర్తిగా ఉన్న షాదీమహల్ నిర్మాణం పూర్తి చేయించాలని కోరారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి తలుపుల మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి డిప్యూటీ సిఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్, వైసిపి రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి డీకే బాబు, మాజీ సర్పంచి ఫయాజ్ అహ్మద్, ప్రభువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సిఎంను సన్మానిస్తున్న నాయకులు

కదిరి టౌన్ : కదిరిలో ప్రయివేటు కార్యక్రమానికి వచ్చిన డిప్యూటీ సిఎం అంజద్‌బాషాకు ఎమ్మెల్యే, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు .పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సమావేశమైన డిప్యూటీ సిఎం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆర్ఎంపిలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

చిలమత్తూరు : ఆర్ఎంపిలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఇంజక్షన్లు వేయకుడదని డిప్యూటీ డిఎంహెచ్ఓ మంజువాణి, డిఐఓ క్రిష్ణయ్య అన్నారు. ఈ మేరకు చిలమత్తూరు ఆర్ఎంపిలతో శుక్రవారం సమావేశమై పలు సూచనలు చేశారు. ఆర్ఎంపిలు ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్‌ను ప్రథమ చికిత్స కేంద్రాలలో ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దాడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు వైసిపి నియోజక వర్గ సమన్వయ కర్త, ఇన్‌ఛార్జి దీపిక వేణు రెడ్డి అన్నారు. శుక్రవారం 14వ వార్డులో సుగురు కట్టపై ఏపీ క్లీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ నిధుల నుంచి రూ.28లక్షలతో నిర్మాణం చేస్తున్న వాకింగ్ ట్రాక్ పనులకు, 15,16,17,27 వ వార్డుల పరిధిలోని సూరప్ప కట్టపై ఏపీ క్లీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ నిధుల కింద మంజూరైన రూ.43 లక్షలతో నిర్మాణం చేస్తున్న వాకింగ్ ట్రాక్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతు గత పాలకులు సూరప్పకుంట అభివృద్ధిలో ప్రజలను మభ్య పెట్టారన్నారు. అయితే తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మేన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు షాజియా, నాగేంద్రమ్మ, మణి, జయప్ప, గుడ్డం దాదు, రోషన్ ఆలి, మల్లికార్జున, మార్కెట్ చాంద్‌బాషా, , వార్డు ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న దీపిక వేణు రెడ్డి

వేగవంతంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా ఇప్పటికే టెండర్ పూర్తై అగ్రిమెంట్ అయిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సూచించారు. అదే సమయంలో గుత్తేదారులు ఇప్పటికే పూర్తి చేసిన పనులకు బిల్లులు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. శుక్రవారం రాత్రి మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ గుత్తేదారులు, ఆడిట్ టీమ్, అకౌంట్ సెక్షన్ హెడ్‌లతో ప్రీ ఆడిట్ పనులకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తేదారుల వారిగా పెండింగ్ పనులపై సమీక్షించారు. మొత్తం దాదాపు రూ.4.63 కోట్ల అభివృద్ధి పనులు ఇప్పటి వరకు అగ్రిమెంట్ జరిగి పనులు చేయలేదన్నారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా గుత్తేదారులు ఇప్పటికే లక్షలాది రూపాయాలు వెచ్చించి అభివృద్ధి పనులను పూర్తి చేశామని, వాటికి సంబందించిన బిల్లులు మంజూరు కావాల్సి ఉందని అన్నారు. ఈ బిల్లులను మంజూరు చేస్తే పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంఇ వెంకటరమణ, ఎఇలతో పాటు ఆడిట్‌బృందసభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్